సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 12 । జూన్ । 2023




బస్సు బోల్తా.. ఏడుగురికి గాయాలు

దైవదర్శనానికి నెల్లూరు నుంచి అన్నవరం వెళుతుండగా మినీ బస్సు ప్రమాదానికి గురైన సంఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. 8లో



ఆదాయం.. ఆశాజనకం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం ఆశాజనకంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో 80 శాతం లక్ష్యాన్ని సాధించారు. 8లో



కాకినాడ జిల్లాలో రోడ్డు ప్రమాదం

తలుపులమ్మలోవ ఆలయ దర్శనానికి వెళ్తుండగా కాకినాడ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పోడూరు మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. 8లో

న్యూస్‌రీల్

తణుకు స్టేషన్‌లో అధునాతన సౌకర్యాలు



కోచ్ ఇండికేషన్ బోర్డు

తణుకు అర్బన్: తణుకు రైల్వేస్టేషన్‌లో నూతనంగా ట్రైన్, కోచ్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటుచేశారు. ఇటీవల స్టేషన్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. అయితే ఇప్పటివరకు ఏ రైలు ఏ ప్లాట్‌ఫామ్ మీదకు వస్తుంది, ఏ బోగీ ఏ ప్రాంతంలో ఆగుతుందో తెలియక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. తాజాగా ఏర్పాటుచేసిన ఎలక్ట్రికల్ బోర్డులతో ఈ సమస్య పరిష్కారమైంది. రానున్న రోజుల్లో ప్లాట్‌ఫామ్‌లు మారేందుకు దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటుచేయనున్నట్టు స్టేషన్ సూపరింటెండెంట్ ప్రభాకరరావు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో చిన్నారులు

ఏలూరు (టూటౌన్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని.. ఇక్కడకు రావడం మంచి అలవాటని అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) అపూర్వ భరత్ అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ, గ్రంథాలయాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు అందించిన శిక్షణాంశాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్లకు అసిస్టెంట్ కలెక్టర్ చేతులమీదుగా మెమెంటోలు అందజేశారు. డీఈఓ ఎస్‌వీ రవిసాగర్, ఆర్టీఐ యాక్ట్ అధ్యక్షుడు కమ్మ శివరామకృష్ణ, సాహిత్యవేత్త చలసాని వెంకట సురేంద్ర, ఎ.నారాయణరావు, డిప్యూటీ లైబ్రేరియన్ విటీ సందీప్‌కుమార్ అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎండీ అస్లాంపాషా, బి.రమేష్, కె.నాగరోజా మణి, బీవీఎస్ లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నడ్డా ఆరోపణలు దారుణం

ఏలూరు (టూటౌన్): ఏపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, అభివృద్ధి నిలిచిపోయిందని, ల్యాండ్-లిక్కర్ స్కామ్‌లు నడుస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన ఆరోపణలను పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రీజినల్ కో-ఆర్డినేటర్ డీవీ రామాంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలతో కలిసి ఏదోవిధంగా తమ పార్టీ ఉనికి నిలుపుకోవాలనే దురుద్దేశంతోనే ఇటువంటి నీచమైన ఆరోపణలకు నడ్డా దిగజారారని విమర్శించారు. అసత్య ఆరోపణలు చేయడం దారుణమని పేర్కొన్నారు.

బడి గంటకు వేళాయె



నేడు పాఠశాలల పునః ప్రారంభం
- 17 వరకు ఒంటి పూట బడులు
- జగనన్న విద్యా కానుక పంపిణీకి సిద్ధం
- ఉమ్మడి జిల్లాలో 2.71 లక్షల మంది విద్యార్థులు

సాక్షి, భీమవరం: గణగణమంటూ బడి గంటలు మోగనున్నాయి.. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన పునః ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బడులు తెరిచిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీకి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లుచేశారు. అయితే ఎండల తీవ్రత తగ్గకపోవడంతో ఈనెల 17 వరకు ఒంటి పూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. విద్యార్థులకు ఉదయం 8.30 గంటలకు రాగి జావ, 11.30 గంటలకు మధ్యాహ్న భోజనం పెట్టి ఇంటికి పంపిస్తారు. ఈనెల 19వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో రెండు పూటలా తరగతులు నిర్వహించనున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా..

పేదల చదువులకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యావిప్లవానికి శ్రీకారం చుట్టారు. ఇంగ్లిష్ మీడియం విద్య, నాడు-నేడు పథకంలో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా వసతులు కల్పిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే మొదటి విడత నాడు-నేడు పనులు పూర్తికాగా రెండో విడత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే విద్యార్థులు దొరబాబుల్లా పాఠశాలలకు వచ్చేలా ఏటా తొమ్మిది రకాల విద్యా సామగ్రితో జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్నారు. స్కూల్ బ్యాగ్, పుస్తకాలు, బూట్లు, సాక్స్, బెల్టులు, యూనిఫాంతో విద్యార్థులు బడులు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. ప్రైవేట్ స్కూళ్ల నుంచి విద్యార్థులు సర్కారీ బడులకు వచ్చి చేరారు. ఇదే రీతిలో ఈ ఏడాది కూడా ప్రవేశాలు ఉంటాయని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. అలాగే విద్యార్థుల తల్లులకు ఏటా ప్రభుత్వం అమ్మఒడి పథకం ద్వారా నగదు ప్రోత్సాహం అందిస్తోంది.



కాళ్లలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

2.70 లక్షల మంది విద్యార్థులు

పశ్చిమగోదావరి జిల్లాలో 1,359 ప్రభుత్వ పాఠశాలల్లో 1,14,024 మంది, ఏలూరు జిల్లాలో 1,857 పాఠశాలల్లో 1,57,845 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ మేరకు జగనన్న విద్యా కానుక పంపిణీకి అధికారులు సిద్ధం చేశారు.

జగనన్న విద్యాకానుక

విద్యా సామగ్రి	పశ్చిమ గోదావరి జిల్లా	ఏలూరు జిల్లా
స్కూల్ బ్యాగులు	1,18,584	1,55,998
బెల్టులు	78,474	1,10,234
నోట్‌బుక్స్	7,24,466	9,30,123
బూట్లు (జతలు)	1,18,431	1,57,244
సాక్స్ (జతలు)	1,18,431	1,57,244
డిక్షనరీలు	12,633	29,247
యూనిఫాం	1,18,584	1,55,998

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
పశ్చిమగోదావరి	1,359	1,14,024
ఏలూరు	1,857	1,57,845

ఎండల తీవ్రతతో..



సోమవారం నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. అయితే ఎండల తీవ్రత దృష్ట్యా ఈనెల 17 వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తాం. ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు తరగతులు నిర్వహించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టి ఇంటికి పంపిస్తాం. జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ ప్రారంభమవుతుంది. ఇప్పటికే అన్ని బడులకు 9 రకాల విద్యాసామగ్రితో కిట్లను సరఫరా చేశాం.

–ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

ట్రిపుల్ ఐటీ.. చదువుల దివిటీ

పేద విద్యార్థులకు వరం
- క్రమశిక్షణ, ఉత్తమ బోధన సొంతం
- చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం
- దరఖాస్తులకు 26 వరకు గడువు

నూజివీడు: ఆహ్లాదకరమైన వాతావరణం, క్రమశిక్షణ, ఉత్తమ విద్యాబోధన నూజివీడు ట్రిపుల్‌ఐటీ సొంతం. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ విద్యాబోధనకు నిలయమైన ట్రిపుల్‌ఐటీలో చదువుతో పాటు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు, శాస్త్రీయ సంగీతం, నాట్యం, యోగా వంటి వాటిలో శిక్షణ కూడా ఇస్తున్నారు. ఉదయం అల్పాహారం అనంతరం అసెంబ్లీ, 8 గంటల నుంచి 12 గంటల వరకు తరగతులు, 12 గంటల నుంచి 1 గంట వరకు భోజన విరామం, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు, అనంతరం టీ, స్నాక్స్, 6 గంటల వరకు ఆటలు, రాత్రి 7 గంటలకు భోజనం, అనంతరం రాత్రి 10 గంటల వరకు స్టడీ అవర్స్.. ఇవీ ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల దైనందిన కార్యక్రమాలు.

1,100 సీట్లు

2023-24 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నూజివీడు ట్రిపుల్‌ఐటీలో 1,000 సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కోటాలో మరో 100 కలిపి మొత్తం 1,100 సీట్లు ఉన్నాయి. వీటిని రోస్టర్ ప్రకారం భర్తీ చేయడంతో పాటు ప్రత్యేక కేటగిరీ కింద స్పోర్ట్స్, స్కౌట్ అండ్ గైడ్స్, సీఏపీ, దివ్యాంగులు, ఎన్‌సీసీ కోటా కింద సీట్లు కేటాయిస్తారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఫీజులు ఇలా..

మొదటి రెండేళ్లు ఏడాదికి రూ.40 వేలు, తర్వాత నాలుగేళ్లు ఏడాదికి రూ.50 వేల చొప్పున ఫీజు చెల్లించాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉన్న విద్యార్థులకు ప్రభుత్వమే చెల్లిస్తుంది.

యోగా.. నృత్యం.. సంగీతం

ఒకవైపు ఇంజినీరింగ్ విద్యను అందిస్తూనే మరోవైపు యోగా, నృత్యం, సంగీతంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు యోగశాలలో యోగాను నేర్పుతారు. అలాగే స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో నృత్యం, సంగీతంలో శిక్షణ ఇస్తారు.

వచ్చేనెల 13న అర్హుల జాబితా

ట్రిపుల్‌ఐటీలో సీటు కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో అర్హుల జాబితాను వచ్చేనెల 13న విడుదల చేస్తారు. వచ్చేనెల 21, 22 తేదీల్లో నూజివీడు ట్రిపుల్‌ఐటీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఏ క్యాంపస్‌లో సీటు వస్తే అక్కడే చదవాల్సి ఉంటుంది.



నూజివీడు ట్రిపుల్‌ఐటీ అకడమిక్ భవనం

విద్యాబోధన ఇలా..

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్‌లో మొదటి రెండేళ్లు ఇంటర్‌కు సమానమైన పీయూసీ కోర్సు, తర్వాత నాలుగేళ్లు ఇంజినీరింగ్ విద్యను బోధిస్తారు. ప్రతినెలా పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభమై నవంబరు 30 వరకు కొనసాగుతాయి. అనంతరం సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. సెలవు రోజుల్లో తల్లిదండ్రులు వచ్చి పిల్లలతో గడపడానికి అవకాశం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో పిల్లలను ఇళ్లకు పంపుతారు. అయితే ఇచ్చిన గడువులోగా తిరిగి రాకపోతే ఫైన్ విధిస్తారు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తారు. ట్రిపుల్‌ఐటీ ఆవరణలోనే 30 పడకల ఆస్పత్రి ఉండగా ఇక్కడ 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారు.

ప్రతిభ ఆధారంగానే..



ట్రిపుల్‌ఐటీలో సీట్లు ప్రతిభ ఆధారంగానే కేటాయిస్తాం. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో ట్రిపుల్‌ఐటీలను ఏర్పాటు చేశారు. ఇక్కడ సీటు లభిస్తే ఆరేళ్ల పాటు ఉచిత విద్య అభ్యసించి ఇంజినీరింగ్ డిగ్రీతో బయటకు వెళ్లొచ్చు.

– ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు, ఆర్జీయూకేటీ అడ్మిషన్ల కన్వీనర్, నూజివీడు

కౌన్సెలింగ్‌కు ఇవి తప్పనిసరి

పదోతరగతి హాల్‌టికెట్, పదో తరగతి గ్రేడ్‌షీట్, పదోతరగతి టీసీ, కాండక్ట్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్ (4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు), కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు. అభ్యర్థి, అతని తండ్రిది లేదా తల్లివి రెండు పాసుపోర్టు ఫొటోలు, రేషన్‌కార్డు, అభ్యర్థి ఆధార్‌కార్డు, విద్యార్థులకు ఎవరికైనా బ్యాంకు రుణం అవసరమైతే పైన పేర్కొన్న సర్టిఫికెట్లన్నీ నాలుగు సెట్లు, అభ్యర్థి తండ్రి ఉద్యోగి అయితే ఎంప్లాయి ఐడెంటీ కార్డు, శాలరీ సర్టిఫికెట్, అభ్యర్థి తండ్రి పాన్‌కార్డు, ఆధార్ కార్డు, ఓటరు ఐడీతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి.

ద్వారకాతిరుమల ఆలయ ఇన్‌చార్జి ఈఓగా విజయరాజు



వేద ఆశీర్వచనం అందుకుంటున్న ఈఓ విజయరాజు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ ఇన్‌చార్జి ఈఓగా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ (కాకినాడ) ఎం.విజయరాజు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న వేండ్ర త్రినాథరావు వ్యక్తిగత కారణాల దృష్ట్యా 15 రోజులు సెలవు పెట్టారు. ఈ క్రమంలో విజయరాజును పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌చార్జి ఈఓగా ప్రభుత్వం నియమించింది. అలాగే త్రినాథరావు సింహాచలం దేవస్థానానికి సైతం ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో, ఆ దేవస్థానానికి పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌చార్జి ఈఓగా విజయవాడ దుర్గగుడి ఈఓ డి.భ్రమరాంబను నియమించారు. ఇదిలా ఉంటే చిన వెంకన్న ఆలయంలో ఇన్‌చార్జి ఈఓ విజయరాజు శ్రీవారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికి, చినవెంకన్న మెమెంటోను అందజేశారు. అనంతరం ఆయన ఆలయ కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు చేపట్టారు.

ఇకపై ఇంటికే పోషకాహారం

- గర్భిణులు, బాలింతలకు అందజేత
- జూలై 1 నుంచి ప్రారంభం
- 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా 20 మండలాల్లో అమలు
- జిల్లాలో 16,384 మందికి మేలు

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో బాలింతలు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తున్నారు. ప్రస్తుతం బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పోషకాహారం తీసుకుంటున్నారు. అయితే దూరంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లేందుకు వీరు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వీరికి ఉపశమనం కలిగించేలా ఇంటి వద్దకే పోషకాహారం అందించేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారు.

వైఎస్సార్ పోషణ కిట్ కూడా..

ప్రస్తుతం బాలింతలు, గర్భిణులను అంగన్‌వాడీ కేంద్రాలకు రప్పించి ఆకుకూర పప్పు, కోడిగుడ్లు వండి పెడుతున్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి ప్రతి గర్భిణి, బాలింతకు 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, 450 గ్రాముల ఆయిల్, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలుతో పాటు వైఎస్సార్ పోషణ కిట్ కూడా ఇంటి వద్దే అందిస్తారు. పోషణ కిట్‌లో కిలో రాగిపిండి, కిలో జొన్నపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల ఖర్జూరం, 250 గ్రాముల చిక్కీలు ఉంటాయి.



ఆకివీడు అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న దృశ్యం

వీటిని ఎలా తీసుకోవాలనే విషయంపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పిస్తారు. ఇంటికే పోషకాహారం అందించనుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఏడు ప్రాజెక్టుల ద్వారా..

జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా 20 మండలాల్లో అంగన్‌వాడీ సేవలు అందిస్తున్నారు. ఆయా కేంద్రాల పరిధిలో బాలింతలు 7,388 మంది, గర్భిణులు 8,996 మంది సేవలు పొందుతున్నారు. మొత్తంగా 16,384 మందికి ఇకపై ఇంటికే పోషకాహారం అందించనున్నారు.

బాలింతలు, గర్భిణులు ఇలా..

ప్రాజెక్ట్	బాలింతలు	గర్భిణులు
భీమవరం	1,127	1,191
పెనుమంట్ర	1,142	600
పాలకొల్లు	1,316	1,382
తణుకు	1,345	1,519
మొగల్తూరు	1,054	1,184
ఆకివీడు	1,400	1,500
తాడేపల్లిగూడెం	1,349	1,620

చాలా సంతోషం



వచ్చే నెల నుంచి గర్భిణులకు ఇంటి వద్దే పోషకాహారం అందించే ఏర్పాటు చేయడం సంతోషం. ఈ సౌకర్యం నాలాంటి గర్భిణులకు బాగా ఉపయోగపడుతుంది. గర్భిణులు దూర ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇంటికే పోషకాహారం అందించేలా ఏర్పాట్లు చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

–యు.రూప, గర్భిణి, పాలూరు

బాలింతలకు ఎంతో మేలు



గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా ఇంటి వద్దే పౌష్టికాహారం అందించే ఏర్పాటు చేయడం బాలింతలకు మేలు చేస్తుంది. చంటి బిడ్డలతో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంటోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం సంతోషం కలిగిస్తోంది.

–ఎస్.జ్యోతి, బాలింత, రాయలం

విజయవంతంగా అమలు



వచ్చే నెల 1వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా బాలింతలు, గర్భిణులకు నేరుగా ఇంటి వద్దే పౌష్టికాహారం అందించనున్నాం. పౌష్టికాహారంతో పాటు వైఎస్సార్ పోషణ కిట్‌లు కూడా వారికి అందిస్తాం. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.సుజాతరాణి, మహిళా, శిశు సంక్షేమ అధికారి, భీమవరం

క్లుప్తంగా

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

ఉండి: భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఉండి మండలం వాండ్రంకు చెందిన ఓ వివాహిత ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం నుంచి అదృశ్యమైంది. ఆమె భర్త శనివారం ఉదయం పనిమీద బయటకు వెళ్ళి మధ్యాహ్నం తిరిగి వచ్చి చూసే సరికి భార్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద విచారించాడు. ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో అతను పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

కాళ్ల: కాళ్ల మండలం సీసలి గ్రామ శివారు వడ్డిగూడెంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువురిని గాయపరిచింది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం వడ్డిగూడెంలో ఆదివారం ఉదయం ఏ ఏడాదిన్నర చిన్నారి కీర్తన ఆడుకుంటుండగా పిచ్చికుక్క లాక్కుని వెళ్తుండగా గమనించిన చిన్నారి తల్లి రత్న కుమారి కూతురిని కాపాడేందుకు ప్రయత్నించింది. కుక్క ఆమెను ముఖం, చేతిపై గాయపరిచింది. అటువైపు వెళ్తున్న నాగమణి అనే మహిళను సైతం కరిచింది. గ్రామస్తులు కుక్కను వెంబడించి చంపడానికి ప్రయత్నించడంతో పారిపోయిందని గ్రామస్తులు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కాళ్ళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వ్యాక్సిన్ వేశారు. కీర్తనను భీమవరం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పిచ్చికుక్కలను అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం.. ఆశాజనకం

- గత ఆర్థిక సంవత్సరంలో 80 శాతం లక్ష్యసాధన
- ఏలూరు జిల్లాలో రూ.287.2 కోట్ల ఆదాయం
- పశ్చిమగోదావరిలో రూ.361.76 కోట్ల ఆర్జన



ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో సంక్షేమ పాలనకే ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఏటా వివిధ ప్రభుత్వ శాఖల నుంచి సంక్షేమ పథకాల రూపంలో రూ.వేల కోట్లను ప్రజలకు పంపిణీ చేస్తోంది. కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమ పథకాలను కొనసాగించి ప్రజలను ఆదుకుంది. లాక్‌డౌన్ నేపథ్యంలో అన్ని కార్యాలయాలను మూసివేయడంతో రావాల్సిన ఆదాయం సన్నగిల్లినా ప్రభుత్వం మాత్రం ప్రజలకు అమ్మ ఒడి, ఆసరా తదితర అనేక పథకాల ద్వారా వారి బ్యాంక్ ఖాతాలకు నేరుగా నగదు జమ చేయడం ఆర్థిక నిపుణులను సైతం ఆశ్చర్యపరిచింది. ఇదిలా ఉండగా ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే శాఖల్లో ఒకటైన రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా అప్పట్లో ఆశించిన ఆదాయం లభించలేదు. క్రమంగా పరిస్థితులు కుదుటపడి ప్రజలు రిజిస్ట్రేషన్ లావాదేవీల వైపు అడుగులు వేయడంతో రిజిస్ట్రేషన్ శాఖకు ఆశించిన స్థాయిలోనే ఆదాయం లభిస్తోందనే చెప్పాలి.

రిజిస్ట్రేషన్లు ఇలా..

సాధారణంగా రిజిస్ట్రేషన్లు అంటే భూముల అమ్మకాలు, కొనుగోలు రూపంలో మాత్రమే జరుగుతాయని అనుకుంటాం. కానీ అధికంగా తనఖాలు, బహుమతులు, పార్టిషన్లు తదితర రూపాల్లో కూడా రిజిస్ట్రేషన్లు జరుగుతూ ఉంటాయి. వీటితో పాటు వివాహాల రిజిస్ట్రేషన్లు, చిట్ ఫండ్ సంస్థల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్, స్వచ్ఛంద సంస్థల గుర్తింపు కోసం రిజిస్ట్రేషన్లు, వివిధ ఉద్యోగ, కుల సంఘాల రిజిస్ట్రేషన్ల రూపంలో సైతం ఆ శాఖకు ఆదాయం లభిస్తోంది. కాగా రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి పరిపాలనా సౌలభ్యం కోసం గతం నుంచి పశ్చిమగోదావరి జిల్లాను రెండు జిల్లాలుగా విభజించి కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. అయితే జిల్లాల పునర్విభజన అనంతరం కొన్ని మార్పులు జరిగాయి. ఆయా జిల్లాల నుంచి కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇతర జిల్లాల్లోకి చేరగా వాటి స్థానంలో ఇతర జిల్లాలకు సంబంధించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఆయా జిల్లాల్లో కలిశాయి.

ఏలూరులో 12, పశ్చిమగోదావరిలో 15 కార్యాలయాలు

జిల్లాల పునర్విభజన అనంతరం ఏలూరు జిల్లా పరిధిలోకి భీమడోలు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, పోలవరం, ఏలూరు, గణపవరం, వట్లూరు, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, నూజివీడు కలిపి మొత్తం 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో అత్తిలి, ఆచంట, ఆకివీడు, భీమవరం, తాడేపల్లిగూడెం, మొగల్తూరు, నరసాపురం, పాలకొల్లు, పెనుగొండ, పెంటపాడు, తణుకు, ఉండి, వీరవాసరం, గునుపూడి, సజ్జాపురం కలిపి మొత్తం 15 కార్యాలయాలు ఉన్నాయి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఆదాయ వివరాలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	దాక్యుమెంట్ల సంఖ్య	వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)
ఏలూరు జిల్లాలో..		
భీమడోలు	11,277	2,873.69
చింతలపూడి	13,525	2,436.56
జంగారెడ్డిగూడెం	11,818	2,551.03
కామవరపుకోట	7,330	1,290.42
పోలవరం	3,632	367.95
ఏలూరు	18,677	9,362.46
గణపవరం	5,061	1,184.86
వట్లూరు	5,726	2,185.98
కైకలూరు	7,376	1,774.27
మండవల్లి	3,333	772.15
ముదినేపల్లి	3,619	974.36
నూజివీడు	15,167	2,946.82
పశ్చిమగోదావరి జిల్లాలో..		
అత్తిలి	7,465	1,274.31
ఆచంట	4,785	784.40
ఆకివీడు	5,516	1,527.89
భీమవరం	11,533	6,625.06
తాడేపల్లిగూడెం	21,117	4707.33
మొగల్తూరు	5,588	1,258.88
నరసాపురం	8,400	2,407.49
పాలకొల్లు	10,152	3,014.30
పెనుగొండ	5,447	1,127.88
పెంటపాడు	2,450	1,801.26
తణుకు	8,732	3,723.64
ఉండి	2,840	909.56
వీరవాసరం	6,284	1,335.24
గునుపూడి	7,504	3,474.85
సజ్జాపురం	7,455	2,204.62

ఈ-స్టాంపింగ్‌లను సద్వినియోగం చేసుకోండి



నాన్ జుడీషియల్ స్టాంపులతో పాటు ప్రభుత్వం ఈ - స్టాంపింగ్‌ను కూడా అనుమతిస్తోంది. అఫిడవిట్లు, అగ్రిమెంట్లు, దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు స్టాంపు పేపర్లే అక్కరలేదు. నాన్ జుడీషియల్ స్టాంపులకు సమాంతరంగా స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ద్వారా ఈ- స్టాంపింగ్ విధానం అమలులో ఉంది. జిల్లాలో అతి తక్కువ ప్రాంతాల్లోనే రిజిస్ట్రేషన్ ధరలు పెరిగాయి. అది కూడా వాస్తవ ధరకు, ప్రభుత్వ ధరకు అత్యధిక వ్యత్యాసం ఉన్న ప్రాంతాల్లోనే రిజిస్ట్రేషన్ ధరలు పెంచాం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిని సహించేది లేదు. ఇప్పటికే సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశాం.

– కె.అబ్రహం, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ

రెండు జిల్లాల నుంచి సుమారు రూ.649 కోట్ల ఆదాయం

రిజిస్ట్రేషన్ల ద్వారా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ప్రభుత్వానికి గత 2022–23 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.649 కోట్ల ఆదాయం లభించగా, దీనిలో ఏలూరు జిల్లా నుంచి రూ.287.20 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లా నుంచి రూ.361.76 కోట్లుగా ఉంది.

మినీ బస్సు బోల్తా.. ఏడుగురికి గాయాలు



జాతీయరహదారి సత్యనారాయణపురం వద్ద బోల్తా పడిన మినీ బస్సు

దెందులూరు: జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లాకు చెందిన 11 మంది అన్నవరంలోని శ్రీ సత్యనారాయణస్వామి దర్శనానికి మినీ బస్సులో వెళ్తున్నారు. ఏలూరు జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణపురం వద్ద వీరు ప్రయాణిస్తున్న మినీ బస్సు ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురికి గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న దెందులూరు పోలీసులు, స్థానికులు బాధితులను 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. బాధితులందరూ ఒకే కుటుంబానికి చెందినవారు. పద్మజ, శివజ్యోతి, భోజరాజు, మాధురి, గుర్రం హనుమంతరావు, పీ.ప్రతాప్, కే.సంజీవమ్మలు తీవ్రంగా గాయపడగా మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ బిగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తి మృతిచెందాడు. ఏలూరు రూరల్ మస్తాన్ మన్యం కాలనీ 1వ రోడ్డుకు చెందిన ఎం.దుర్గారావు (55) రిక్షా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్యతో కలిసి రేకుల షెడ్డులో అద్దెకు ఉంటున్నాడు. ఇంటి యజమాని రేకుల షెడ్డు మార్చటంతో ఆదివారం రాత్రి సీలింగ్ ఫ్యాన్ బిగించేందుకు పైకి ఎక్కాడు. అయితే విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. ఏలూరు రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదు



మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీటీసీ): టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ప్రజలు నమ్మే పరిస్థితులలో లేరని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ళు ఇస్తానంటే కడుపు మంటతో కోర్టుకెళ్ళిన చంద్రబాబు పేదలను ధనికులను చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014 టీడీపీ మేనిఫెస్టోలో ఏటా 12 సిలెండర్లపై రూ.100 చొప్పున సబ్సిడీ ఇస్తామని బాబు హామీ ఇచ్చారని, ఒక్కో మహిళకు 5 ఏళ్లలో ఇస్తానన్న మొత్తం సబ్సిడీ ఎగ్గొట్టారన్నారు. రైతు రుణాలు మొత్తం మాఫీ చేస్తానని హామీ ఇచ్చి రైతులను, డ్వాక్రా రుణాలు రూ 14,500 కోట్లు చెల్లిస్తానని చెప్పి డ్వాక్రా మహిళలను దారుణంగా మోసం చేశారని తెలిపారు.

కాకినాడ జిల్లాలో రోడ్డు ప్రమాదం

- ఇద్దరు పోడూరు మండల వాసుల మృతి
- జిన్నూరుపాలెం గ్రామంలో తీవ్ర విషాదం



కుక్కల ఉమా సత్యసాయి(ఫైల్)



మల్లుల ఆంజనేయులు(ఫైల్)

పోడూరు/గండేపల్లి: తలుపులమ్మలోవ ఆలయ దర్శనానికి వెళ్తుండగా కాకినాడ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పోడూరు మండలం జిన్నూరు శివారు జిన్నూరుపాలెంకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామం నుంచి ఐషర్ వాహనంలో 35 మంది గ్రామస్తులు శనివారం రాత్రి సుమారు 12.30 గంటలకు కాకినాడ జిల్లాలోని తలుపులమ్మలోవ దర్శనానికి బయల్దేరారు. అర్ధరాత్రి 2.30 నుంచి 3 గంటల మధ్య గండేపల్లి మండలంలోని మురారి శివారు ఎస్సార్ బంక్ సమీపంలోని టీ టైం షాపు వద్దకు వచ్చేసరికి వ్యాన్ డ్రైవర్ మొల్లుల శ్రీను వ్యాన్‌ను నిలిపాడు. డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు వ్యాన్ దిగి టీ తాగిన అనంతరం బయలుదేరేందుకు సిద్ధమవుతుండగా.. హైదరాబాద్ నుంచి విశాఖ వెళుతున్న ట్రావెల్స్ బస్సు వీరిని ఢీకొంది. అనంతరం టీ షాప్ పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వ్యాన్ ప్రయాణికుడు కుక్కల ఉమాసత్యసాయి (22) బస్సు అడుగు భాగంలో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ మల్లుల ఆంజనేయులు(22) కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడగా వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురికి గాయాలయ్యాయి.



సత్యసాయి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి వెంకటేశ్వరి

కానిస్టేబుల్ పరీక్షకు సిద్ధమవుతుండగా..

ఉమాసత్యసాయి పాలిటెక్నిక్ పూర్తి చేసి ఇటీవలే కానిస్టేబుల్ ఉద్యోగ పరీక్ష కూడా పాసయ్యాడు. ఫిజికల్ టెస్ట్‌కు సిద్ధమవుతున్నాడు. అతని తండ్రి సూరిబాబు గుజరాత్‌లోని స్పిన్నింగ్‌మిల్లులో పనిచేస్తున్నాడు. ఆంజనేయులు 10వ తరగతి చదివాడు. ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి అక్కడ 2 ఏళ్లు పనిచేశాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అతని తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తుంటారు. తీవ్రంగా గాయపడిన కుక్కల వంశీ(18) కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో, చెల్లబోయిన సాయి(22) భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడ్డ కలగంపూడి చంద్రశేఖర్(35), గుబ్బల శ్రీనివాస్(38) పాలకొల్లులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో, జల్లి వంశీ(22), కుక్కల సురేష్(35), కుక్కల బాలాజీ(24) రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. సత్యసాయి భౌతికకాయానికి పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. సాయంత్రానికి అతని మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి సత్యసాయి భౌతికకాయాన్ని చూసి కన్నీరు పెట్టుకున్నారు. ఆంజనేయులు మృతదేహం సోమవారం ఉదయానికి స్వగ్రామానికి చేరుకుంటుంది.



ప్రమాదస్థలం వద్ద దృశ్యం

తప్పిన పెను ప్రమాదం

ప్రైవేట్ బస్సు రోడ్డు పక్కగా నిలిపిన మినీ వ్యాన్‌ను ఢీకొట్టి ఉంటే టీ కోసం ఆగిన ప్రయాణికులంతా రెండు వాహనాల మధ్య చిక్కుకుని మృత్యువాత పడేవారని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. బస్సు కాలువలోకి దూసుకెళ్లి ఆగిన ప్రాంతంలో చెట్టు ఉంది. దానిని ఢీకొని ఉంటే బస్సులోని ప్రయాణికులూ గాయపడేవారు. బస్సు ప్రయాణికులు ఇతర వాహనాల్లో గమ్యస్థానాలకు బయలు దేరారు.

నటుడు సుమన్‌కి సత్కారం



తిరుమలాపురంలో నటుడు సుమన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురంలో నటుడు సుమన్ సందడి చేశారు. శ్రీభోగ సుందర సీతారామస్వామి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సుమన్‌కి ఆశీర్వచనాలు అందజేసి, ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం అనన్య చిత్రంలో నటిస్తున్న సుమన్ ఆ చిత్ర సన్నివేశాలను చిత్రీకరించిన తిరుమలాపురం స్వర్గీయ కనుపర్తి లక్ష్మీ వీర్రాజు గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కనుపర్తి వేణుమాధవ్, పద్మజ, కనుపర్తి శ్రీనివాస్, కనకదుర్గ దంపతులు సుమన్‌ను సత్కరించారు. వీర్రాజు సతీమణి రంగనాయమ్మ ఆశీస్సులు తీసుకున్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు టౌన్: కళాశాలకు వెళ్ళిన విద్యార్థిని తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కైకలూరుకు చెందిన యువతి (22) ఏలూరులోని ఒక కళాశాలలో బీబీఏ చదువుతోంది. ఈ నెల 10న ఏలూరు నగరానికి వచ్చింది. సాయంత్రానికి ఇంటికి చేరకపోవటంతో కుటుంబ సభ్యులు ఏలూరు త్రీటౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు కృషిచేయాలి

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ జక్కంపూడి గణేష్

జంగారెడ్డిగూడెం: 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించడానికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం విశేషంగా కృషి చేయాలని యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ జక్కంపూడి గణేష్ పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్ ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద యువజన విభాగం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల జోనల్ ఇంచార్జ్ జక్కంపూడి గణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాలకు చెందిన వైఎస్సార్‌సీపీ యువజన సంఘాలను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో యువతదే కీలక పాత్ర అని.. వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి యువజన సంఘ విభాగం అలుపెరుగని కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న నవరత్నాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల ప్రజలు పొందుకున్న మేలులు వివరించాలన్నారు. రాష్ట్రంలో ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టడానికి యువజన విభాగం సిద్ధంగా ఉందన్నారు. యువగళం పేరుతో నారా లోకేష్ చేస్తున్న యాత్రలో వైఎస్సార్‌సీపీగానీ, తమ నాయకులను గానీ దుర్భాషలాడితే లోకేష్ కు తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. యువజన విభాగం ఆధ్వర్యంలో త్వరలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జక్కంపూడి గణేష్‌ను పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీపీఎన్ చంద్ర రావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చవుటపల్లి వీరన్న, మున్సిపల్ కౌన్సిలర్‌లు కటారి వాసు, నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, గంజి వినోద్, సీనియర్ నాయకులు పంది రాజా, జిల్లా యాదవ సంఘం సెక్రెటరీ నీలపాల అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



జక్కంపూడి గణేష్‌ను సత్కరిస్తున్న యువజన విభాగం అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్ తదితరులు

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

- ప్రారంభమైన ఖరీఫ్ సీజన్
- విత్తనశుద్ధితో పైరుకు చీడపీడలు దూరం
- తొలి దశ నుంచే జాగ్రత్తలు తప్పనిసరి

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో తొలి దశలోనే రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాగులో వరి పైరుకు ఎటువంటి తెగుళ్లు సోకకుండా ఉండటానికి విత్తన శుద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విత్తనశుద్ధి ద్వారా తెగుళ్లను దాదాపు అరికట్టవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

నారుమడిలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి

నారుమడి పోసే ముందు రైతులు విత్తనాలను శుద్ధి చేసుకోవాలి. తడి పద్ధతిలో ఒక గ్రాము బావిస్టన్ ఒక లీటరు నీటికి, పొడి పద్ధతిలో మూడు గ్రాములు బావిస్టన్ ఒక కిలో విత్తనానికి వాడాలి. తొలుత విత్తనాలు మొలక కట్టాలి. మొలక శాతం 85 శాతం మించి ఉండాలి. ఎకరంలో నారు కోసం ఐదు సెంట్లలో నారు మడిని పెంచాలి. నారు సరిగ్గా పెరగకపోతే ఐదు సెంట్ల నారు మడికి రెండు కిలోల యూరియాను చల్లుకోవాలి. నారు పీకడానికి ఒక వారం ముందు ఒక కిలో కార్బాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు లేదా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకలో కలిపి చల్లాలి. నాటిన 25 రోజుల వరకు కాండం తొలుచు పురుగు, తెగుళ్లు రాకుండా ఉంటాయి. నాటినప్పుడు కొసలు తుంచి నాటాలి. ఈ కొసలలో కాండం తొలుచు పురుగు గుడ్లు పెడుతుంది. కొసలను తుంచడం వల్ల ముందస్తుగా తెగుళ్లను నివారించకోవచ్చు. నారు నాటేటప్పుడు మొక్క మూడు ఆకుల దశలో ఉండేలా చూడాలి. నారు నాటిన వెంటనే రెండ్రోజుల పాటు ఐదు సెంటీమీటర్ల నీరు నిల్వ ఉంచాలి. రెండు రోజుల తర్వాత నుంచి ఆఖరు వరకు రెండు సెంటీమీటర్లు నీరు ఉంచాలి. జింకు లోపం ఉన్న భూముల్లో జింక్ సల్ఫేడ్ ఎకరానికి 20 కిలోలు వాడాలి. ఆఖరున దుక్కిలో వేయాలి.





నారుమడులు

అందుబాటులో విత్తనాలు



రైతులకు అవసరమైన విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సొమ్ములు చెల్లించి విత్తనాలను తీసుకోవాలి. ఎటువంటి గుర్తింపు, నాణ్యత లేని విత్తనాలను రైతులు కొనుగోలు చేసి మోసపోవద్దు. ప్రైవేట్ వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు పొందాలి. నారు వేసుకునే ముందు విత్తనశుద్ధి చేసుకోవడం వల్ల తెగుళ్లను నివారించవచ్చు.

– పి.మురళీకృష్ణ, ఏడీఏ, తాడేపల్లిగూడెం

క్లుప్తంగా

గేదె దూడను రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



తణుకులో గేదె దూడను రక్షిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు

తణుకు అర్బన్ : తణుకు సంత మార్కెట్ ప్రాంతంలోని ఫిషరీస్ చెరువులో గుర్రపుడెక్కలో చిక్కుకుపోయిన గేదె దూడను అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు రక్షించారు. గత ఐదు రోజులుగా గేదె దూడ చెరువులోని గుర్రపుడెక్కలో చిక్కుకుపోయిందని మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్‌కు వచ్చిన సమాచారంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది గుర్రపుడెక్కతో నిండిపోయి ఉన్న ఊబిలాంటి చెరువులోకి దిగి దూడను కాపాడారు. ఐదురోజులపాటు చెరువులో ఇరుక్కుపోయి నీరసించిన దూడకు వైద్యసేవలు అందచేసి వదిలేశారు.

నేడు యూపీఎఫ్ సర్వసభ్య సమావేశం

పెంటపాడు: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యుపీఎఫ్) సర్వసభ్య సమావేశం సోమవారం పరిమెళ్ల గ్రామంలోని రెవ. కె. ఎలీషా ఆధ్వర్యంలో ఏసయ్యా ప్రార్థనా మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షులు ఎం.జైబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించబోయే ఈ సమావేశానికి సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని జైబాబు కోరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక సమాహారం



జ్యోతి ప్రజ్వలనలో కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో ఆదివారం రాత్రి సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం వైభవంగా నిర్వహించారు. బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షులు బుద్ధాల వెంకట రామారావు అధ్యక్షత వహించారు. శ్రీ డ్యాన్స్ అకాడమీ నాట్య ప్రవీణ్ శ్రీనివాస్ ఆళ్ళతో సభా పరిచయం చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అఖిలభారత శ్రీ వైష్ణవ సంఘం అధ్యక్షులు కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులకు గౌరవ పురస్కారం, కూచిపూడి నాట్యాచారిణి జి.బ్రాహ్మణికి కళా సత్కారం, నంది అవార్డు గ్రహీత ఎ.రజనీబాయికు ఆర్థిక సత్కారం చేశారు.

బీచ్‌లో సందర్శకుల సందడి



కేపీ పాలెం బీచ్‌లో సేదతీరుతున్న పర్యాటకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలి వచ్చారు. ఉదయం నుండి ఎండ విపరీతంగా కాయడంతో పాటు వేడి గాలులు వీస్తుండటంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వర స్వామి,వేలాంకణీ మాత, పాండరంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి దుస్తుల పంపిణీ

ఆకివీడు: సేవా కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు అధిక ప్రాధాన్యతనివ్వాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారానే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అన్ని విధాలుగా సేవలందించాలని సూచించారు. వలంటీర్లు చేస్తున్న సేవల్ని ప్రజలు, అన్ని పార్టీలు హర్షిస్తుంటే, టీడీపీ ఈర్ష్య చెందుతోందని విమర్శించారు.

అంబేడ్కర్ విగ్రహ దాతలకు సత్కారం

సాక్షి, భీమవరం: పట్టణంలో అంబేడ్కర్ విగ్రహ దాతలను ఏపీ షెడ్యూల్డ్ కూలాల సంక్షేమ సంఘంలోని కాంస్య విగ్రహ కమిటీ చైర్మన్ శ్రీకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ జడ్జి నెల్సన్ రాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం సుమారు 58 మంది దాతలకు ఘన సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో యాళ్ల హనోక్‌వర్ధన్, రాజేస్, కె.శ్యామలరావు, కేసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు స్వలాభాన్ని పవన్ సమర్థించడం అవివేకం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



వెలంపేట ప్రాంతంలో మహిళలకు జగనన్న పథకాలు వివరిస్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ఏదో విధంగా అధికారమే పరమావధి అంటూ దాని కోసం అడ్డదారులు తొక్కుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు స్వలాభాన్ని పవన్ సమర్థించడం అవివేకమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. రాచర్ల గ్రామంలో గడపగడపకూ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన వెలంపేట రామాలయం వద్ద 9, 10, 14 క్లస్టర్లు, ఎస్సీపేట, అరుందతీ పేట, కమ్యూనిటీ హాలు ప్రాంతాలలోని 6, 7, 8, 12, 13, 15 క్లస్టర్లలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించార. ఈ సందర్భంగా రాచర్ల వెలంపేట, ఎస్సీపేట కమ్యూనిటీ హాలు ప్రాంతాల్లో ఆయన మట్లాడారు. జగనన్న చేస్తున్న అభివృద్ధికి ప్రజలు సంతోషిస్తున్న సమయంలో చంద్రబాబు రాబోయే రోజులలో అధికారంలోకి రాలేమని పత్రికలను అడ్డుపెట్టుకుని ఇష్టానుసారంగా ప్రభుత్వానికి వ్యతిరేక కథనాలు రాయిస్తున్నారని మండిపడ్డారు. దీంతో పాటు చంద్రబాబు చెబుతున్న అబద్దాలు ప్రజలు నమ్మడం లేదని తెలుసుకుని సినీ నటుడు పవన్‌కల్యాణ్‌ను అడ్డుపెట్టుకొని పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. కాగా రాష్ట్ర ప్రజలు ఇవన్నీ గ్రహిస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వమైనా నాలుగేళ్ల అనంతరం బయటకు రావాలంటే భయపడుతుందని కానీ జగనన్న నాయకత్వంలో నూరుశాతం హామీలు అమలు చేసి ఎన్నికల ముందు ధైర్యంగా ప్రజల వద్దకు వస్తుంటే వారు ప్రభుత్వంపై చూపే ఆదరాభిమానాలు వర్ణించలేనివన్నారు. తొలుత ఆయా ప్రాంతాలోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో మంత్రి మాట్లాడారు. గ్రామంలో పరిస్థితులను తెలుసుకున్నారు. ఇంటింటికి పథకాలు అందుతున్నాయా? లేదా? ప్రశ్నించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాకా దుర్గా భవాని, దోకుల కమలాకర్, వాకా వెంకట సుబ్బారావు, చింతన నారాయణరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, సొసైటీ అధ్యక్షులు కుంచే సుబ్రహ్మణ్యం, మజ్జి సుబ్బారావు, పార్టీ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, ఎంపీపీ దాసరి హైమావతి, సొసైటీల అధ్యక్షులు బూరాడ శ్రీనివాస్, దేవ వెంకటరమణ, గుండుమోగుల సాంబయ్య, ములగాల రామ సత్యనారాయణ, నల్లమిల్లి విజయ్ ఆనంద్‌రెడ్డి, సర్పంచ్‌లు గొర్రెల కోటేశ్వరరావు, గేదల శివకుమార్, చాంబర్ అధ్యక్షులు పెన్నాడ సూరిబాబు, రెడ్డి సూరిబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు దాసరి ప్రవీణ, వైస్ ఎంపీపీ ముప్పిడి సరోజిని, సంపతరావు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు దానేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల ప్రారంభం

తణుకు టౌన్ : తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వేంచేసియున్న శ్రీ దానేశ్వరి అమ్మవారి నూతన దేవాలయ నిర్మాణ పనులను సోమవారం సాయంత్రం ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. ఆలయ నిర్మాణ పనులను రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఆలయం వద్ద సభా కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

నేడు అయ్యప్ప ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో గ్రామస్తులు, అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించే అయ్యప్ప ఆలయానికి సోమవారం ఉదయం 7 గంటలకు శంకుస్థాపన పూజలు నిర్వహించనున్నట్లు ఆదివారం ఆలయకమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

థ్యాంక్యూ సీఎం సార్..

- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సాహసోపేతమైన నిర్ణయమన్న ఉద్యోగులు
- వైద్యవిధాన పరిషత్‌ను ప్రభుత్వశాఖగా మార్చినందుకు కృతజ్ఞతలు
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు

తణుకు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కురిపించిన ప్రేమాభిమానానికి ఉద్యోగులంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏళ్ల తరబడి నెలకొని ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కేబినెట్‌లో ఆమోదంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవితాంతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకుంటామని.. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినదిస్తున్నారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేస్తూ ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణతోపాటు పీఆర్‌సీ ప్రకటన, వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు అందచేసే ప్రక్రియకు ప్రభుత్వం కేబినెట్‌లో ఆమోదం తెలపడంతో ఉద్యోగవర్గాలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి.

పీఆర్‌సీ కమిటీ చరిత్రాత్మకం



ఉద్యోగుల సమస్యలు తెలిసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగడం మా అదృష్టం. పీఆర్‌సీ కోసం కమిటీ వేయడం చారిత్రాత్మకం. ఉద్యోగుల పక్షపాతిగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఉద్యోగులంతా అండగా నిలబడాల్సిన అవసరం ఉంది.

– ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, ఏపీ ఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షులు

ఇకపై 1వ తేదీనే వేతనాలు



వైద్యవిధాన పరిషత్‌ను ప్రభుత్వ శాఖగా మార్పుచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులంతా రుణపడి ఉంటాం. ఉద్యోగులకు 010 పద్దు ద్వారా 1వ తేదీనే వేతనాలు ఇచ్చేందుకు నాంది పలికిన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

– వైవీఎస్‌బీ రాయుడు, వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల సంఘం తణుకు శాఖ కార్యదర్శి

సాహసోపేత నిర్ణయం



ఉద్యోగులు కోరుకుంటున్నట్లుగా సీపీఎస్ రద్దు చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతో సాహసోపేతమైనది. సర్వీసంతా చాకిరీ చేసి పదవీ విరమణ అనంతరం ఎటువంటి పెన్షన్ లేని సీపీఎస్ విధానం ఉద్యోగులను కలవరపరుస్తుంది. పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌ను అమలు చేస్తానని హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం.

– కేఎస్‌వీ నరసరాజు, ఏపీ ఎన్జీవోస్ తణుకు శాఖ అధ్యక్షులు

మాట తప్పని నేత సీఎం జగన్



ఇప్పటివరకు ఏ నేత చేయలేని సాహసాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల చిరకాల వాంఛ పీఆర్‌సీతోపాటు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయడం వంటి అంశాలతో ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. ఇచ్చిన మాట తప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రుజువు చేసుకున్నారు.

– కేశిరెడ్డి వెంకట సత్యనారాయణ, ఏపీ ఎన్జీవోస్ తణుకు శాఖ కార్యదర్శి

నూతన జాతీయ విద్యావిధానంపై అవగాహన



లెక్చరర్లకు శిక్షణ అందిస్తున్న శిక్షకులు

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కళాశాల ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిషు బోధన నూతన విద్యావిధానాన్ని అధ్యాపకులు తప్పనిసరిగా అమలు చేయాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. గత కొన్ని రోజుల నుంచి పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిషు అధ్యాపకులకు నిర్వహిస్తున్న మొదటివిడత శిక్షణ శనివారం సాయంత్రం ముగించారు. ఈ సందర్భంగా ముగింపు సమావేశంలో పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంగ్లిషు బోధనలో మెలకువలు అధ్యాపకులు తప్పని సరిగా తెలుసుకోవాలన్నారు. ఈ శిక్షణలఓ పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాలోని 9 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన 39 మంది లెక్చరర్లు ఈ శిక్షణలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రిసోర్స్‌సెంటర్ కో ఆర్డినేటర్లు, మాస్టర్ ట్రినర్స్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుంచి రెండో విడత శిక్షణ

అలాగే సోమవారం నుంచి కళాశాల అధ్యాపకులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం స్థానిక పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 12 నుంచి 17 వరకు జరిగే శిక్షణలో అధ్యాపకులు తప్పక పాల్గొని నూతన విద్యావిధానంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ విజేత 'తణుకు'



క్రికెట్ టోర్నమెంట్ విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీపీ శేషులత

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. మొత్తం 39 టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొనగా, ఆదివారం తణుకు – జగన్నాథపురం మధ్య జరిగిన పోటీలో తణుకు విన్నర్‌గాను, జగన్నాథపురం రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా ఎంపీపీ పానుకుమాటి శేషులత మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తాయని, క్రీడలపై యువత దృష్టి సారించాలన్నారు. అనంతరం టోర్నమెంట్ విజేత టీమ్‌కు రూ.20వేలు నగదు బహుమతి, ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో నవాబుపాలెం సొసైటీ డైరెక్టర్ చిట్టూరి బాపన్న, మాజీ డైరెక్టర్ పోసిన శ్రీను, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ, పానుకుమాటి శ్యామ్‌బాబు, నీలం నరసింహమూర్తి, యూత్ ప్రెసిడెంట్ కందెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): వాళ్లు కలిసిన ఆలోచన వేరు.. అది ఎదిగిన తీరు ఆదర్శప్రాయం. పూర్వ విద్యార్థులంతా ఒక చోట కలిసి వారి మనోభావాలు పంచుకోవాలనుకున్నారు. తీర కలిసాక ఒక పరమార్థం ఆపాదించాలని నిర్ణయించి ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా నిలవాలనే ఆలోచనతో ఆ దిశగా నడిచారు. స్నేహ స్పందన ఫౌండేషన్ ఏర్పాటు చేసి వారు ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి పూర్వ విద్యార్థులంటే ఇలా ఉండాలని నిరూపించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీ) లో 1982–83 పదోతరగతి విద్యార్థుల 40 సంవత్సరాలు ఆత్మీయ సమ్మేళనం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో అత్యంత్త వైభవంగా నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనం అలరించింది. ఎక్కడెక్కడో వివిధ రంగాల్లో స్థిరపడ్డ సుమారు 150 మంది మిత్రులు కలిసి తమ గత స్మృతులను పంచుకొన్నారు. ఏడు సెక్షన్లు 'ఎ' నుంచి 'జీ' వరకు ఉన్న ఆయా సెక్షన్ల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఆ నాటి ఉపాధ్యాయురాలు మాలతి మాధవ్ పూర్వ విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రవా శ్రీనివాస్, బాయిశెట్టి శ్రీనివాస్, నున్నా సూర్య శ్రీరామ్, గోపి ధనరాజు, ఈగల తాతారావు, సొలస సత్యనారాయణ, అందే మల్లిఖార్జున్, చాట్రగడ్డ సత్యనారాయణ, షా ఆలం, డేవిడ్ బాబు, డాక్టర్ శ్రీదేవి, పసల నాగ నందిత, పద్మ ప్రభ, సవితా లక్ష్మి, నున్న శ్రీవల్లి, వేణి, అనురాధ, సత్యవాణి పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను పదవి నుంచి తొలగించాలి

సాక్షి, భీమవరం: రెజ్లర్లతో అసభ్యంగా ప్రవర్తించిన ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రకాశంచౌక్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి నాయకులు మాట్లాడారు. రెజ్లర్లపై ఎంపీ ప్రవర్తన దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి ఎంపీని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.బలరాం, సీహెచ్ రంగారావు, గంటా సుందర్‌కుమార్, అనపర్తి కృష్ణప్రసాద్, యు.సుజాత, ఆర్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని సబ్‌కలెక్టర్ చెప్పారు. ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని సూచించారు.

నేడు ఏనుగువానిలంకలో రాములోరి విగ్రహ ప్రతిష్ఠ



ధాన్యాధివాసంలో శ్రీ గణపతి శ్రీ సీతారామచంద్ర స్వాముల విగ్రహాలు

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక పంచాయతీ పల్లి పోలవరంలో నూతనంగా నిర్మించిన శ్రీ గణపతి శ్రీ సీతారామచంద్ర పరివార దేవతా నూతన ఆలయంలో సోమవారం విగ్రహ, యంత్ర, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ మన్నే కుమార స్వామి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ వారి రూ.10 లక్షల ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఆలయం నిర్మించినట్లు ఆయన వివరించారు. ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా ఆదివారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మార్జనలు, పంచగవ్యప్రాశన, వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తు బలి, ధాన్యాధివాసం తదితర పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం పూజలు నిర్వహించి 7 గంటల 29 నిమిషాలకు విగ్రహ, యంత్ర, శిఖర ప్రతిష్ఠ జరుగుతుందని కుమారస్వామి చెప్పారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేసినట్లు చెప్పారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలి



తణుకు టౌన్: వేల్పూరు గ్రంథాలయంలో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు



తణుకు టౌన్: మహిళా గ్రంథాలయంలో విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

తణుకు టౌన్ : విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడానికి ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణా తరగతులు ఎంతగానో దోహదం చేశాయని ఆర్మీ అధికారి కే శ్రీనివాసరావు అన్నారు. తణుకు పట్టణంలో బ్యాంక్ కాలనీలో ఉన్న పురుషుల శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బెల్లంకొండ బుచ్చిబాబు, గ్రంథాలయ అధికారి, విద్యార్థులు పాల్గొన్నారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి చిలుకూరి సుజాత, ప్రముఖ రచయిత వై విజయలక్ష్మి, డాక్టర్ అపర్ణ, రిసోర్సు పర్సన్‌లు వై ప్రభాకర్, త్రిపుర సుందరి, నాగ పద్మావతి, వి.గీత తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రిటైర్డ్ ఎంఈవో సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, ఎ.ధనరాజు, సీహెచ్ సీతారామాంజనేయులు, జి.బసవేశ్వరరావు, టి.నాగలక్ష్మి, ఎ. నాగలక్ష్మి, ఎల్.వెంకటరమణ, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): గ్రంథాలయాలను చదవరులుగా సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు విద్యార్థులకు సూచించారు. పట్టణ గ్రేడ్-1 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం పిల్లల ఆనందోత్సవాలు మధ్య ముగిసింది. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పిల్లలకు పలు అంశాలలో అవగాహనతో పాటు ఇటీవల నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. దాత సాయిరాం వస్త్ర షోరూమ్ అధినేత శీరపు అప్పారావు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు గురజాడ బ్రహ్మాజీ, పి.భాస్కరరావులు వివిధ సహాయ సహకారాలు అందజేశారు. విశ్రాంత అధ్యాపకులు ప్రత్తి వీరాస్వామి, జి.బాపయ్య శర్మ, ఎస్.సాల్మన్‌రాజు, వై.లక్ష్మణరాజు, ఎ.జనార్ధనరావు తదితరులను సత్కరించారు. యోగా టీచర్ బడుగు చంద్రశేఖర్, కనకదుర్గమ్మలు విద్యార్థులకు యోగా అంశాలపై అవగాహన కల్పించారు.

పెంటపాడులో..

పెంటపాడు: ఎంతో విజ్ఞానాన్ని అందించే దేవాలయం లాంటి గ్రంథాలయ సందర్శన ప్రతీ విద్యార్థికి ప్రత్యేక దినచర్య కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి పేర్కొన్నారు. పెంటపాడు శాఖా గ్రంథాలయంలో గత కొంతకాలంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ముగించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మహ్మద్ జుల్ఫికర్ ఆలీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విద్యార్థులకు పలు విషయాలు బోధించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి వరహాలరెడ్డి మాట్లాడుతూ కేవలం సెలవుల్లోనే కాక ఎన్నో పుస్తకాలతో ఎంతో వి/జ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను నిత్యం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రముఖ సామాజిక వేత్త ఏలూరి జగదీష్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమం నుంచి గ్రంథాలయాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. శిక్షణలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.



పెంటపాడు : విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న నిర్వాహకులు



తాడేపల్లిగూడెం (టీటీసీ) : విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేస్తున్న దృశ్యం